క్లుప్తంగా

సమస్యల పరిష్కారం కోసమే స్పందన : ఆర్డీఓ

రేపల్లె: ప్రజాసమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ఆర్డీఓ జగన్నాథం పార్థసారధి తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు. మొత్తం ఏడు అర్జీలు అందాయన్నారు. వీటిలో స్మశాన వాటిక సమస్యపై ఒక దరఖాస్తు, పెన్షన్‌కై ఒకటి, స్థల సమస్యలపై 4 దరఖాస్తులు అందాయన్నారు. అదేవిధంగా కళ్లాల్లో ధాన్యం కుప్పలను దగ్ధం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ మరో అర్జీ అందిందన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

బ్రిడ్జి కోర్సులకు అడ్మిషన్ పొందాలి

నిజాంపట్నం: ఐటీఐ కోర్సులు రెండు సంవత్సరాలు పాసైన విద్యార్థులకు పాలిటెక్నిక్ రెండవ సంవత్సరంలో అడ్మిషన్ పొందేందుకు బ్రిడ్జి కోర్సును నిర్వహించడం జరుగుతుందని ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకరబాబు తెలిపారు. సోమవారం నిజాంపట్నం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బ్రిడ్జి కోర్సును ఈనెల 9 నుంచి ఫిబ్రవరి 8వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఐటీఐ రెండు సంవత్సరాలు పూర్తయిన విద్యార్థులు పాలిటెక్నిక్ రెండవ సంవత్సరంలోకి అడ్మిషన్ పొందేందుకు ఆసక్తి ఉన్నవారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌ను ఈనెల 7వ తేదీలోగా ఐటీఐ కళాశాలలో సమర్పించాలని కోరారు. ఫిబ్రవరి 12 నుంచి 14వ తేదీ వరకు ఎంపిక పరీక్ష నిర్వహిస్తామన్నారు.

ప్రారంభమైన షిర్డీ సాయిబాబా జయంతి వార్షికోత్సవాలు



భట్టిప్రోలు: భట్టిప్రోలు రథం సెంటర్‌లోని షిర్డీ సాయిబాబా ఆలయంలో 78వ జయంతి వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బాబావారికి ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, కాగడ హారతి శాస్త్రయుక్తంగా నిర్వహించారు. సీజీజీబీ మేనేజర్ ఆర్.సురేష్ జ్యోతి ప్రజ్వలన చేయగా, ఆలయ కమిటీ నిర్వాహకులు మాటూరు రామకృష్ణ ఉమాశంకర్ పతాకావిష్కరణ చేశారు. కార్యక్రమాలను దేవస్థాన కమిటీ అధ్యక్షుడు తమ్మన రమేష్‌బాబు పర్యవేక్షించారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి

కొల్లూరు: భార్య పుట్టింటికి వెళ్లి రావడం లేదన్న మనస్థాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ఈపూరుకు చెందిన సీదర్ల కార్తిక్ (24) మూడేళ్ల క్రితం నంబూరుకు చెందిన మరియజ్యోతిని వివాహం చేసుకున్నాడు. అప్పట్నుంచి అతని భార్య పుట్టింటికి వెళ్లి అక్కడే ఉంటుండటంతో పలుమార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీలు నిర్వహించి భార్యను ఇంటికి తీసుకువచ్చాడు. అయినప్పటికీ భార్య పదేపదే పుట్టింటికి వెళ్లి అక్కడే ఉంటుండటంతో మనస్థాపానికి గురయ్యాడు. గత నెల 15న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంతో గమనించిన బంధువులు గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అప్పట్నుంచి చికిత్స పొందుతున్న అతను పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. వైద్యశాల నుంచి అందిన నివేదిక ఆధారంగా సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

కొత్త సంవత్సరంలో మెరుగైన సేవలు

తెనాలి: కొత్త సంవత్సరంలో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందేలా చూస్తామని తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ పేర్కొన్నారు. నూతన సంవత్సరంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. గీతాంజలి శర్మ కేక్ కట్ చేశారు. కార్యాలయం ఉద్యోగులు, డివిజను పరిధిలోని వివిధ మండలాల తహసీల్దార్లు సబ్ కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారి బి.వెంకటేశ్వర్లు, డీటీ ఎంపీఎస్ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ మల్లేశ్వరీ, హనీ ప్రియ, పద్మశేషు, డీఐ ఆఫ్ సర్వే కోటిరెడ్డి, డిప్యూటీ స్టాటిస్టికల్ అధికారి విజయలక్ష్మి, సీసీలు నరేంద్ర, వరప్రసాద్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రంగస్థల కళాకారుడు కోటేశ్వరరావుకు సన్మానం

తెనాలిఅర్బన్: నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో సోమవారం శ్రీ తిరుపతి వేంకటేశ్వర కళ్యాణం చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. మంగళవారం శ్రీ మద్విరాటపర్వం చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రముఖ పౌరాణిక, రంగస్థ కళాకారుడు దేశబోయిన కోటేశ్వరరావును ఘనంగా సన్మానించారు.

భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి వేడుకలు



రేపల్లెలో వేంకటేశ్వరస్వామిని ఉత్తరద్వార దర్శనం చేసుకుంటున్న భక్తులు



జమ్ములపాలెంలో ప్రత్యేక అలంకరణలో మహాలక్ష్మి అమ్మవారు



వేమవరంలో ఉత్తర ద్వార దర్శనంలో రుక్మాభాయి సహిత పాండురంగ స్వామి



కొల్లూరులో పుష్పాలతో ప్రత్యేక అలంకరణలో దేవతామూర్తులు



చెరుకుపల్లి చెన్నకేశవ స్వామి ఆలయంలో ప్రత్యేకంగా అలంకరించిన స్వామివారు

వైష్ణవాలయాలకు పోటెత్తిన భక్తులు

రేపల్లె: ముక్కోటి ఏకాదశి పర్వదిన వేడుకలు నియోజకవర్గ పరిధిలో సోమవారం అత్యంత వైభవంగా జరిగాయి. పట్టణంలోని పలు వైష్ణవాలయాలలో వేడుకలను నిర్వహించారు. పూజా కార్యక్రమాలలో భాగంగా వేకువజాము నుంచే ఆయా దేవాలయాలలో సుప్రభాత సేవలు, విశేష అర్చనలు, మంత్ర పుష్పాది కార్యక్రమాలు, అభిషేకాలు తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉప్పూడిలో రోడ్డులోని లక్ష్మీగోదా సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో, ఓల్డ్ టౌన్‌లోని వేణుగోపాలస్వామి దేవాలయంలో, రామకోటిపేటలోని పట్టాభిరామస్వామి దేవాలయంలో, కోదండ రామస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచే స్వామివారిని భక్తులు ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకున్నారు. అదేవిధంగా పెనుమూడిలోని రామస్వామి ఆలయం, రావిఅనంతవరం గ్రామంలో వేణుగోపాలస్వామి ఆలయంలో, చోడాయపాలెంలో యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లోనూ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు విష్ణు సహస్రనామపారాయణం, భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా దేవాలయాల కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

పిట్టలవానిపాలెంలో..

పిట్టలవానిపాలెం: మండలంలోని పలు గ్రామాలలోని దేవాలయాలలో ముక్కోటి వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తరద్వార దర్శన కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు.అల్లూరు రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయంలో స్వామివారిని ఉత్తర ద్వారము ద్వారా దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్తలి మండలి చైర్మన్ వాలి వెంకట శివారెడ్డి, కార్యనిర్వహణాధికారి బారికేడ్లు ఏర్పాట్లు పర్యవేక్షించారు. అనంతరం భక్తులకు దక్షిణావృత శంఖంద్వారా తీర్థ ప్రసాదాలు అందజేశారు. బాపట్ల రూరల్ సిఐ వేణుగోపాలరెడ్డి దంపతులు, వైఎస్సార్ సీపీ నాయకులు, అలకాపురం గ్రామ సర్పంచి మంతెన గంగరాజులు నరసింహస్వామివారిని ఉత్తర ద్వారము ద్వారా దర్శించుకున్నారు. ఖాజీపాలెం సీతారామ చంద్రస్వామివారి దేవాలయం, శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం, చందోలు రాజ్యలక్ష్మీ సమేత ఆంజనేయ చెన్నకేశవస్వామి దేవాలయం, కోమలి రామాలయం, గోకరాజునల్లి బోయినవారిపాలెంలో వేంకటేశ్వరస్వామి వారిని ఉత్తర ద్వార దర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. కోమలిలో వైఎస్సార్ సీపీ నాయకుడు, గ్రామసర్పంచి శ్యామల నాగిరెడ్డి స్వామివారిని ట్రాక్టర్‌పై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు.

కొల్లూరులో...

కొల్లూరు: వైకుంఠ ఏకాదశి వేడుకలు కొల్లూరు మండలంలో అత్యంత వైభవంగా జరిగాయి. మండలంలోని పలు ఆలయాలు సోమవారం తెల్లవారు జాము నుంచి భక్తులతో కిటకిటలాడాయి. కొల్లూరులోని వేణుగోపాల స్వామి ఆలయానికి మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు తెల్లవారుజాము నుంచి తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో నిండిపోయింది. దైవ దర్శనం అనంతరం ఆలయంలో భక్తులు దీపారాధనలు చేసి ప్రత్యేక పూజలు చేశారు.

జమ్ములపాలెంలో ...

బాపట్ల: జమ్మలపాలెం గ్రామంలో వేంచేసియున్న త్రిశక్తి దేవాలయం నందు స్వయంభుగా వెలిసిన మహాలక్ష్మి అమ్మవారికి వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు చేపట్టారు. మహాలక్ష్మి అమ్మవారిని ఉత్తర ద్వారం గుండా వచ్చిన భక్తులకు ఆశీర్వచనాలు అందించారు. అర్చకుడు కొండపాటూరు సత్యానంద శర్మ, నిర్వాహకులు ఆదర్శ రైతు కాపు అంకమ్మ చౌదరి ,కాపు బాబు ,శ్రీరామ శేషు ఏర్పాట్లు చేశారు.

నగరంలో...

నగరం: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని సోమవారం మండలంలోని భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు.ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని వైష్ణవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే ఆలయాలలో భక్తుల సందడి నెలకొంది.భక్తులుఅధిక సంఖ్యలో ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిప్రపత్తులు చాటుకున్నారు. నగరంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం వీరాంజనేయస్వామి ఆలయం, పెద్దవరంలోని శ్రీరంగనాయకస్వామి, పూడివాడలోని వేణుగోపాలస్వామి దేవస్థానములలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేసి ఉత్తర ద్వార దర్శనం కల్పించారు.

చెరుకుపల్లిలో...

చెరుకుపల్లి: ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా సోమవారం ఉదయం నాలుగు గంటల నుంచే భక్తులు స్వామివారిని ఉత్తర ద్వారం నుంచి దర్శించుకునేందుకు బారులు తీరారు. మండలంలోని అరుంబాక వేణుగోపాల స్వామి దేవస్థానం, చెరుకుపల్లి చెన్నకేశవ స్వామి దేవస్థానం, షిరిడీ సాయి మందిరం, గూడవల్లి లక్ష్మీ నరసింహా స్వామి దేవస్థానాలలో ఏర్పాటు చేసిన ఉత్తర ద్వారం నుంచి స్వామి వారు భక్తులకు దర్శనం ఇచ్చారు. చెన్నకేశవ స్వామి దేవస్థాన ఈఓ శ్రీనివాస వర్మ మాట్లాడుతూ ఆలయంలో ఉదయం ఐదు గంటల నుంచి పది గంటల వరకు సుమారు మూడు వేల మంది పైగా భక్తులు ఉత్తర ద్వారం నుంచి స్వామి వారిని దర్శించుకున్నారన్నారు. అనంతరం స్వామివారికి గరుడ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ పాలక మండలి చైర్మన్ అవ్వారు రామారావు పాలక మండలి సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

కర్లపాలెంలో...

కర్లపాలెం: అగ్రహారం గ్రామంలో వేంచేసియున్న రాజ్యలక్ష్మీ సమేత జనార్ధనస్వామివారి ఆలయంలో సోమవారం ముక్కోటి ఏకాదశి పూజలు ఘనంగా జరిగాయి. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని స్వామివారి భక్తులు పుణ్యస్నానాలాచరించి తెల్లవారుజామున స్వామివారి గుడి చేరుకుని ప్రదక్షిణలు చేశారు. పూజలు చేసి ఉత్తరద్వార దర్శనం చేసుకున్నారు. ముక్కోటి, వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పెనుమెత్స వెంకటరామరాజు కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, బృందావనం శ్రీనివాసాచార్యులు, ఆండాళ్ తయార్ గోష్టి నిర్వహించారు. ఏట్రవారిపాలెం పంచాయతీ కొత్తరాజుపాలెంలోని కోదండరామస్వామి ఆలయంలో, బుద్దాం గ్రామంలోని రామాలయంలో ముక్కోటి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి.

జంపని(వేమూరు): మండల పరిధిలోని పలు గ్రామాల్లో వైష్ణవాలయాల్లో సోమవారం వైకుంఠ ఏకాదశ పర్వ దినాన్ని వైభవంగా నిర్వహించారు. జంపని గ్రామంలో చెన్న కేశవాలయం, పెరవలి వేణు మాధవ, వేమూరులో వేణు కేశవ, చదలవాడలో చెన్న కేశవ, చావలిలో వేణు గోపాల ఆలయాల్లో వార్షిక ఉత్తర ద్వార దర్శనం జరిపారు.

భట్టిప్రోలులో...

భట్టిప్రోలు: వైకుంఠ ఏకాదశి (ముక్కోటి) పురస్కరించుకుని భట్టిప్రోలులో కొలువైన శ్రీ రుక్మిణి సత్యభామా సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానంలో సోమవారం స్వామి వారి ఉత్తర ద్వార దర్శనం నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున స్వామి వార్లకు బింది తీర్థము, ధనుర్మాస పూజలు నిర్వహించి ఉత్తర ద్వార దర్శనంలో భక్తులకు దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాలను అగ్నిహోత్రం నరసింహ శ్రీనివాస్, వేణుగోపాల చక్రవర్తిలు శాస్త్రయుక్తంగా నిర్వహించారు. దేవస్థాన ఎండోమెంట్ వంశపారంపర్య ఫౌండర్ ట్రస్టీలు మానేపల్లి రఘునాథ బాబు, పార్వతీ శంకరసాయి, మానేపల్లి లక్ష్మి ప్రణతిలు పర్యవేక్షించారు. మండలంలోని సూరేపల్లి పంచాయతీ పరిధిలోని వేమవరంలో కొలువైన శ్రీ రుక్మాభాయి సహిత శ్రీ పాండురంగ స్వామి దేవాలయం, షిర్డి సాయిబాబా ఆలయం, వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం , అద్దేపల్లిలోని సంతాన వేణుగోపాలస్వామి దేవాలయాల్లో కూడా ఉత్తర ద్వార దర్శనం ఏర్పాట్లు చేశారు.

పెదపులివర్రు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రులో కొలువైన భూనీలా సమేత వరద రాజస్వామి వారి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని సోమవారం స్వామి వార్లకు సహస్రనామార్చన, ప్రత్యేక పూజలు జరిగాయి భక్తులు తెల్లవారు జాము నుంచే ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. పూజా కార్యక్రమాలను కృష్ణామాచార్యులు దీవి శరత్ కుమార్, సీతారామానుజాచార్యులు, పవన్‌కుమార్‌లు శాస్త్రయుక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వాహణాధికారి మేకా సాంబశివరావు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కంఠమనేని హరిప్రసాద్‌లు పాల్గొన్నారు. వెల్లటూరు చెన్నకేశవస్వామి దేవాలయం, పల్లెకోన కోదండరామ స్వామి దేవాలయం, ఐలవరం వేణుగోపాలస్వామి దేవస్థానాల్లో భక్తులు స్వామివార్లను ఉత్తరద్వార దర్శనం చేసుకున్నారు.

సావిత్రిబాయి పూలే సేవలు చిరస్మరణీయం

రేపల్లె: బాలికా విద్యకై సావిత్రిబాయి పూలే సేవలు చిరస్మరణీయాలని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. పట్టణంలోని శారద ఐటీఐ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సావిత్రిబాయ్ పూలే జయంతి ఉత్సవాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలోనే ప్రథమ మహిళా ఉపాధ్యాయినిగా బాధ్యతలు చేపట్టి బాలికలు, మహిళలు అక్షరాస్యులుగా తీర్చిదిద్దారన్నారు. అనంతరం సావిత్రీబాయ్ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కళాశాల కరస్పాండెంట్ బడుగు వెంకట నారాయణ, బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ కొప్పనాతి నాగ బాబు, సభ్యులు యేమినేని యానాదిరావు, మండే ప్రసాద్, మేరుగు నాగేశ్వరరావు, అన్నం హరీష్, సుధ, బీసీ నాయకులు పాల్గొన్నారు.

వలంటీర్లకు నియామకపత్రాలు అందజేత



నియామక పత్రాలను అందజేస్తున్న ఎంపీపీ యారం వనజ, ఎంపీడీఓ ఎలీషాబాబు

కర్లపాలెం: గ్రామ వాలంటీర్లు అంకిత భావంతో విధులు నిర్వహించాలని ఎంపీపీ యారం వనజ తెలిపారు. కర్లపాలెం మండల పరిధిలో నూతనంగా వలంటీర్లుగా నియమితులైన వారికి సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ యారం వనజ, ఎంపీడీఓ ఎలీషాబాబులు నియామక పత్రాలందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వలంటీర్లు ప్రజలకు వివరించటంతో పాటు అర్హులైన వారికి అందే విధంగా కృషి చేయాలని చెప్పారు. ఎంపీడీఓ ఎలీషాబాబు మాట్లాడుతూ కర్లపాలెంలో ముగ్గురుని, పాతనందాయపాలెంలో ఒకరిని, పెదగొల్లపాలెం ఇద్దరిని, పెదపులుగువారిపాలెంలో ఒకరిని గ్రామ వలంటీర్లుగా నియమించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు ఎస్‌కే ఆసిఫ్ ఆలీ, తాండ్ర సాంబశివరావు ఉన్నారు.

నేడు నూతన పెన్షన్‌ల పంపిణీ

రేపల్లె రూరల్: మండలంలో నూతనంగా పెన్షన్‌లకు ఎంపికైన లబ్ధిదారులకు పట్టణంలోని శ్రీపత్తిపాటి సీతారామ యోగిని-పాలాటి రాజ్యలక్ష్మి మెమోరియల్ హాలులో ఈ నెల 3వతేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు పంపిణీ చేయటం జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ మల్లికార్జునరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు చేతుల మీదుగా నిర్వహించే పంపిణీ కార్యక్రమంలో లబ్ధిదారులు పాల్గొనాలని తెలిపారు.

అంతుపట్టని వ్యాధితో మంచానికే పరిమితం

తమ ముగ్గురు కుమారుల దుస్థితి చూసి కన్నీరు మున్నీరవుతున్న తల్లిదండ్రులు



ముగ్గురు యువకులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న కేసన శంకరరావు

నిజాంపట్నం: అంతుపట్టని వ్యాధితో రోజురోజుకీ ఆరోగ్యం క్షీణిస్తున్న ముగ్గురు యువకులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. నిజాంపట్నం మండలంలోని అడవులదీవి పంచాయతీ పల్లెపాలెం గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ సత్యన్నారాయణ, వెంకటరమణ దంపతులకు ముగ్గురు కుమారులు. వీరు అంతుపట్టని వ్యాధితో సుమారు 14 సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయాన్ని తెలుసుకున్న కేసన శంకరరావు ఆ ముగ్గురు యువకులను సోమవారం పరామర్శించి తల్లిదండ్రులతో మాట్లాడారు. ఈ సందర్భంగా తండ్రి సత్యన్నారాయణ సమస్యను వివరించారు. 23, 21, 19 ఏళ్ల కలిగిన తన ముగ్గురు కుమారులు చరణ్‌కుమార్, కిరణ్‌కుమార్, నితిన్ కుమార్‌లు పుట్టినప్పటినుంచీ ఒక్కొక్కరికీ 8 సంవత్సరాలు వచ్చే వరకూ ఎలాంటి ఆరోగ్య పరమైన సమస్యలు లేవని తెలిపారు. వారిలో ప్రతి ఒక్కరికీ 9వ సంవత్సరం నుంచి బోన్ పరమైన సమస్యలు తలెత్తడం వల్ల ముగ్గురూ మంచానికే పరిమితమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో వైద్యశాలలకు తిప్పినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో ముగ్గురినీ ఇంట్లోనే ఉంచుకుని వారి ఆరోగ్యాన్ని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. తమ పిల్లల ఆరోగ్య పరిస్థితి రోజురోజుకు క్షీణించి పోతుండటంతో ఏం చేయాలో అర్థం కాని పరిస్థితుల్లో ఉండిపోయామని కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. పెద్దకుమారుడి ఆరోగ్య పరిస్థితి మరింత విషమంగా ఉందని తెలిపారు. దీనిపై స్పందించిన కేసన శంకరరావు బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామన్నారు. ఆ కుటుంబానికి బీసీ సంక్షేమ సంఘం ఎప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఆయన వెంట బీసీ సంఘ నాయకుడు కొపనాతి నాగబాబు తదితరులు ఉన్నారు.

ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలి



ఐలవరం హైస్కూల్‌లో ట్యాబ్‌లతో విద్యార్థులు

ఐలవరం(భట్టిప్రోలు): విద్యార్థులకు అందించిన ట్యాబ్‌లను వినియోగించుకుని మరింత అభివృద్ధి చెందాలని పలువురు ప్రజా ప్రతినిధులు ఆకాంక్షించారు. భట్టిప్రోలు హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న 123 మంది విద్యార్థులకు, బోధిస్తున్న 15 మంది ఉపాధ్యాయులకు సోమవారం 138 ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఇందులో బై జూస్ కంటెంట్ వినియోగం గూర్చి విద్యార్థులకు ఎంఈఓ పులి లాజర్ తెలియచేశారు. గ్రామ సర్పంచి మాచర్ల కోటేశ్వరరావు, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరి, ఎంపీటీసీ మురుగుడు శ్రీనివాసరావు, హెచ్‌ఎం కాటూరి లక్ష్మీనారాయణ, ఎస్‌ఎంసీ చైర్మన్ పులిమి కుసుమ కుమారి, ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.

పెదపులుగువారిపాలెం(కర్లపాలెం): విద్యార్థులకు ట్యాబ్‌లతో బోధన ఉపయుక్తంగా ఉంటుందని సర్పంచి అక్కల శ్రీనివాసరెడ్డి తెలిపారు. పెదపులుగువారిపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం అర్లమ్మ ఆధ్వర్యంలో సోమవారం ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. సర్పంచి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ అందజేసిన ట్యాబ్‌లను వినియోగించుకుని విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ కమిటీ చైర్‌పర్సన్ అక్కల కళ్యాణి, ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం పోటీలు

ఆచార్య నాగార్జున, కృష్ణా విశ్వవిద్యాలయాలకు చెందిన 100 మంది విద్యార్థులు హాజరు



మాట్లాడుతున్న ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు

పిట్టలవానిపాలెం: మండలంలోని కేవీఆర్, కేవీఆర్ అండ్ ఎంకేఆర్ కళాశాలలో సోమవారం మంతెన వెంకటరాజు ఫౌండేషన్ సౌజన్యంతో ఆచార్య నాగార్జున మరియు కృష్ణా విశ్వవిద్యాలయాల అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం పోటీలను నిర్వహించారు. ఈపోటీలలో విజేతలకు బహుమతులు అందజేసేందుకు ముఖ్యఅతిథిగా హైదరాబాద్ విశ్వవిద్యాలయ రిటైర్డు ఆచార్యులు గారపాటి ఉమామహేశ్వరరావు పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు విద్యతో పాటు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొని మంచి వక్తలుగా తయారు కావాలని తెలిపారు. అంతేకాక సమాజానికి సేవ చేసేవిధంగా ఉండాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ తలశిల శివప్రసాద్ మాట్లాడుతూ ఆచార్య నాగార్జున మరియు కృష్ణా విశ్వవిద్యాలయాల పరిధిలో 45 కళాశాలల నుంచి 100 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. కళాశాల పాలక మండలి సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ మంతెన శ్రీనివాస కుమార్, పాలక మండలి ఉపాధ్యక్షుడు మంతెన వెంకట శివరామరాజు, జాయింట్‌సెక్రటరీ ఎం.కృష్ణంరాజు,అధ్యాపకులు ఉన్నారు.

విజేతలు వీరే...

వక్తృత్వం పోటీలలో మొదటి బహుమతి చీరాల చైతన్యభారతి డిగ్రీ కళాశాలకు చెందిన జి.శివవాణిప్రసాద్‌కు రూ.5 వేలు, ప్రశంసా పత్రం, ద్వితీయ బహుమతిని తాడికొండ గోగినేని కనకయ్య ఓరియంటల్ కాలేజి విద్యార్థి పి.రూప్ల నాయక్‌కు రూ.3వేలు, ప్రశంసా పత్రం, తృతీయ బహుమతిని బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాలకు చెందిన సీహెచ్ భార్గవికి రూ.2 వేలు ప్రశంసాపత్రాలను అందజేశారు.

వ్యాసరచనలో మొదటి బహుమతిని నాగార్జున సాగర్ ఏపీ రెసిడెన్షియల్ కాలేజీకి చెందిన పి.రవిప్రసాద్ రూ. 5 వేలు, ప్రశంసా పత్రం, ద్వితీయ బహుమతిని తెనాలి జేఎంజే కాలేజీ ఫర్ ఉమెన్ కళాశాలకు చెందిన కె.సింధుకు రూ.3 వేలు, ప్రశంసాపత్రం, తృతీయ బహుమతిని గుంటూరు చిప్స్ కాలేజీకి చెందిన సీహెచ్ హర్షవర్ధన్‌కు రూ.2 వేలు, ప్రశంసాపత్రంను అందజేశారు.

వృద్ధులకు దుస్తులు పంపిణీ

తెనాలిటౌన్: గాంధీ నగర్‌లోని షిరిడీ సాయి వృద్ధాశ్రమంలో నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం సభ్యులు, ప్రధానోపాధ్యాయులు కుర్రా శ్రీనివాసరావు సహకారంతో వృద్ధులకు చీరలు, పంచెలు పంపిణీ చేశారు.రీ కార్యక్రమంలో ఎస్వీ యోగ కన్వీనర్ ఎం.రమణయ్య, పసుపులేటి సావిత్రి, జ్యోతి, భవాని, ఆశ్రమ నిర్వాహకులు సత్యనారాయణ, సుజాత, పలువురు యోగా సాధకులు పాల్గొన్నారు

శేషపాన్పుపై దర్శనమిచ్చిన కోదండరామస్వామి

తెనాలి: పట్టణంలోని మారీసుపేటలో ఉన్న శ్రీ కోదండరామస్వామి దేవస్థానం (శ్రీరామభక్త అప్పలస్వామి గుడి)లో వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని స్వామివారు 'శేషు పాన్పుపై లక్ష్మీసమేతంగా' విశేష అలంకరణతో భక్తులకు ఉత్తర ద్వార దర్శనమిచ్చారు. విష్ణుభట్ల ఆంజనేయశాస్త్రి ఆధ్వర్యంలో శ్రీ సుదర్శన హోమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ లంక శివానంద్ కుమార్ మాట్లాడుతూ ఆలయంలో ధనుర్మాస పూజలను విశేషంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆలయంలో ఈ ఏడాదిలో నిర్వహించే పండుగలన్నింటిలోనూ భక్తులను కూడా భాగస్వాములను చేస్తున్నామని తెలిపారు.

గ్రామాభివృద్ధే లక్ష్యం

తెనాలిటౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవ్వాతాతలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని నందివెలుగు సర్పంచ్ ధూళిపాళ్ళ పవన్ కుమార్ పేర్కొన్నారు. నందివెలుగు గ్రామం పంచాయతీ కార్యాలయంలో సోమవారం గ్రామ సభను నిర్వహించారు. సభకు సర్పంచ్ పవన్ కుమార్ అధ్యక్షత వహించారు. గ్రామంలో కొత్తగా 33 మందికి పింఛన్‌లు మంజూరైనట్లు చెప్పారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆశీస్సులతో గ్రామ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. గ్రామంలో జడ్పీ పాఠశాలకు నూతన గదులు, విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం, సిమెంట్ రోడ్లు నిర్మాణం జరిగాయని సర్పంచ్ తెలిపారు. పింఛన్‌లు మంజూరైన వారికి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు షేక్ షిలార్ జానీ, తిన్నలూరి విజయలక్ష్మి, ఉప సర్పంచ్ మంగా శివనాగేశ్వరరావు, వార్డు సభ్యులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు. రూరల్ మండలం కఠెవరం గ్రామంలో సచివాలయ కన్వీనర్‌లు గ్రామ వలంటీర్‌లతో కలసి సోమవారం పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో కొత్తగా 32 మందికి పింఛన్‌లు మంజూరైనట్లు తెలిపారు.